వరి రైతు వెలవెల

- గిట్టుబాటు ధర లేక ఆందోళన
- దిగుబడి ఉన్నా ధరలేదంటున్న అన్నదాతలు
- పెట్టుబడి పెట్టి సాగు చేస్తే నిరాశే మిగిలిందని నిట్టూర్పు



వరి పంట కోస్తున్న యంత్రం



ఎల్లోటిలో రైతు ఇంటిలో నిల్వ ఉంచిన వరి బస్తాలు

మడకశిరరూరల్: వేరుశనగ సాగు చేసి, ఇతర పంటలు సాగు చేసి ఏటేటా నష్టాలు చవి చూస్తున్న రైతులు.. ఎన్నో ఆశలతో రబీలో వరి సాగు చేస్తే తీరా కోత దశలో గిట్టుబాటు ధరలు లేక నష్టాలు మూట కట్టుకోవాల్సి వస్తోంది. అప్పు చేసి ఎకరాకు రూ.25వేలు పెట్టుబడి పెట్టి వరి సాగు చేశారు. పంటకు తెగుళ్ల తక్కువగా ఉండడంతో దిగుబడి వస్తుందని ఆశించారు. ఆశించిన మేరకు దిగుబడి ఉన్నా తీరా కోత దశలో పంటకు గిట్టుబాటు ధరలేక దిగాలు చెందుతున్నారు. మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, అగళి, రొళ్ల, అమరాపురం, గుడిబండ మండలాల్లో రైతులు అప్పు చేసి బోరు బావుల కింద దాదాపు 500 ఎకరాలకుపైగా వరి పంట సాగు చేశారు. ఈఏడాది పంటకు వాతావరణం అనుకూలించి తెగుళ్ల వ్యాప్తి పెద్దగా లేకపోవడంతో మంచి దిగుబడి వచ్చిందని రైతులు అంటున్నారు. ఎకరాకు 30 బస్తాలకుపైగా దిగుబడి వచ్చే అవకాశం ఉందంటున్నారు. వరి పంట కోతకు రావడంతో కూలీలు, యంత్రాల ద్వారా రైతులు పంటను తొలగించి నూర్పిడి చేసి విక్రయించడానికి సిద్ధం చేస్తున్నారు.

గిట్టుబాటు ధర ధర కల్పించాలి

కూటమి ప్రభుత్వం రైతులు కష్టపడి పండించిన వరికి గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గతేడాది క్వింటా వరికి రూ.3,200 వరకు గిట్టుబాటు ధర ఉండడంతో రైతు ఆదాయం పొందారు. కానీ ఈ ఏడాది రబీలో పండించిన వరికి వ్యాపారులు క్వింటా రూ.1,600 నుంచి రూ.1,700 వరకు మాత్రమే ధర అడుగుతున్నారు. ఈ ధరతో విక్రయిస్తే పంట సాగుకు చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికి సరిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విక్రయించకుండా ఇంట్లో నిల్వ ఉంచుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు రైతు సంక్షేమానికి చర్యలు తీసుకోలేదు.. కనీసం పండించిన పంటకైనా గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు.

ఇంట్లోనే వరి బస్తాలు నిల్వ



అప్పు చేసి బోరు బావుల కింద 1.75 ఎకరాలో ఎకరాకు రూ.25 వేల ఖర్చు పెట్టి వరి సాగు చేశా. పండించిన వరికి గిట్టుబాటు ధర లేక దళారులకు వరిని విక్రయించకుండా దాదాపు 65 బస్తాలు ఇంట్లో నిల్వ చేశా. క్వింటాల్ రూ.1700తో అడుగుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే అప్పులకు వడ్డీ చెల్లించడానికి సరిపోతుంది. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– శ్రీరామరెడ్డి ,రైతు ఎల్లోటి, మడకశిర మండలం

గిట్టుబాటు ధర కల్పించాలి



అప్పు చేసి చెమటోడ్చి పండించిన వరికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి రైతు నష్టపోకుండా ఆదుకోవాలి. కింట్వా వరికి రూ.1,700 ధర మార్కెట్‌లో ఉంది. ఈ ధరకు విక్రయిస్తే పంట సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా చేతికి రాదు. దీంతో ఇంటిలో నిల్వ ఉంచుకున్నా. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి.

– నరసింహమూర్తి రైతు, కదిరేపల్లి, మడకశిర మండలం

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ఎస్.రాయాపురంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎస్.రాయాపురం బస్టాండ్ ఆవరణలో దళిత నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈరలక్కప్ప మాట్లాడారు. సమాజంలో అందరికి సామాన హక్కులు కల్పించిన మహానేత అంబేడ్కర్ మాత్రమే అని కొనియాడారు. అనంతరం నాయకులను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధమ్మ, కొంకల్లు సర్పంచ్ కవిత ఓబన్న, మండలపల్లి సర్పంచ్ అశ్వత్థ, నాయకులు హులియప్ప, రాయుడు, గుడ్డదహళ్లి నాగరాజు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'ఎంజేపీ సెట్'



పరీక్షకు హాజరైన విద్యార్థులు

గుడిబండ: స్థానిక ఎంజేపీ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన పరీక్ష సజావుగా జరిగింది. మొత్తం 250 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 179 మంది హాజరయ్యారు. 71 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు.

లేపాక్షి: మండల కేంద్రంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో ఇంటర్ ప్రవేశ పరీక్ష సజావుగా జరిగినట్లు ప్రిన్సిపాల్ సుందరరాజు ఆదివారం తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్‌లో ప్రవేశాల కోసం 701 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 411 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. త్వరలోనే ఫలితాలు విడుదల చేస్తామని తెలిపారు.

మైనార్టీ నాయకుడికి పరామర్శ

సోమందేపల్లి: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకుడు దాదాపీర్‌ను ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ ఆదివారం పరామర్శించారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న దాదాపీర్ ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కన్వీనర్ గజేంద్ర, సర్పంచ్ జిలాన్‌ఖాన్ పాల్గొన్నారు.

టిప్పు సుల్తాన్ వర్ధంతి



వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఆజాద్ నగర్ సర్కిల్ వద్ద హిందూ ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం నగారా–అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్ అధ్యక్షతన టిప్పు సుల్తాన్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మహనీయులు షహీద్ టిప్పు సుల్తాన్ మాతృ భూమి కోసం రాజీ లేని పోరాటం చేసి ప్రాణ త్యాగం చేశారన్నారు. హిందూ ముస్లింలను రెండు కళ్లుగా భావించారని. శృంగేరి పీఠాన్ని మరాఠాలు ధ్వంసం చేస్తే పునర్నిమించారన్నారు. ఎరుకల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎరుకల శంకర్, తూముకుంట పారిశ్రామిక సంఘం అధ్యక్షుడు రవి, బీఎస్పీ నేత హరి, మాజీ ముతవల్లీ కలీమ్, వైఎస్సార్ సీపీ నేత అమానుల్లా, కాంగ్రెస్ నేతలు జమీల్, ఫయాజ్ టిప్పు సుల్తాన్ రక్త దాన సంఘం షేక్ షబ్బీర్, అతీఖుర్రహమాన్, అర్బాజ్, అబ్దుల్ రహమాన్, టైలర్ యూనియన్ జబీ పాల్గొన్నారు.

ఇద్దరు వీఆర్ఏలకు నియామక పత్రాలు



వీఆర్ఏలకు నియామక పత్రాలు అందజేస్తున్న తహసీల్దార్ షేక్షావలి

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏలుగా విధులు నిర్వహిస్తున్న రొళ్ల అశ్వత్థప్ప, రత్నగిరి చిక్కతిమ్మప్ప ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో రొళ్ల అశ్వత్థప్ప కుమారుడు సందీప్, రత్నగిరి చిక్కతిమ్మప్ప కుమారుడు రంగనాథ్‌కు కారుణ్య నియామకం కింద ఆదివారం సాయంత్రం ఇరువురికి నియామక పత్రాలు అందజేసినట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ గిరియప్ప, మండల సర్వేయర్ కిరణ్ కుమార్, వీఆర్వోలు నాగరాజు, రంగనాథ్, నరసింహమూర్తి, చిరంజీవి, లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భగీరథ జయంతి వేడుకలు



భగీరథ విగ్రహం వద్ద పూజలు



భగీరథ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని భగీరథ సర్కిల్‌లో భగీరథ జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ విగ్రహాన్ని సుందరంగా అలంకరించి పూజలు చేపట్టారు. భగీరథ మహర్షిని మనమందరం ఆదర్శంగా తీసుకోవాలని, కఠోర దీక్ష ద్వారా దివి నుంచి భూమిపైకి గంగాదేవిని తీసుకొచ్చిన మహాపురుషుడు యావత్ ప్రపంచానికి నీటి దాహం తీర్చిన భగీరథ మహర్షి జయంతి పరమ పవిత్రమైనటువంటిదని, ఆయనను స్మరించుకోవాలని ఉప్పర, సగర సంఘం నాయకులు అన్నారు. కార్యక్రమంలో స్థానికులు, ఉప్పర కులస్తులు పాల్గొన్నారు.

సోమందేపల్లి: సగర కులస్థుల ఆరాధ్య దైవమైన భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తపల్లి క్రాస్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఆ సంఘం నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు వెంకట రమణ, ఆదెప్ప, బాబయ్య, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

పావగడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఉప్పర కులస్తుల ఆరాధ్య దైవం భగీరథ మహర్షి జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా భగీరథ చిత్రపటానికి తహసీల్దార్ వరదరాజు పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, ఉప్పర సామాజిక వర్గం నాయకులు పాల్గొన్నారు.

ఆరో తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

పావగడ: పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరో తరగతిలో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక బీఈఓ ఇంద్రాణమ్మ, పాఠశాల హెచ్ఎం సావిత్రమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా ఆన్‌లైన్ లేదా పాఠశాలకు వచ్చి దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అనాథలు, పేదలు, పాఠశాలకు వెళ్లని బాలికలు, ఒకరి ఆశ్రయంలో ఉన్న వారిని పాఠశాలలో చేర్చుకుంటామని పేర్కొన్నారు.

బాలకృష్ణకు పౌర సన్మానం



ఎమ్మెల్యే బాలకృష్ణతో మంత్రి సవిత, ఎంపీ, ఎమ్మెల్యేలు

చిలమత్తూరు: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు అందించింది. ఈ నేపథ్యంలో ఆదివారం టీడీపీ నేతలు హిందూపురం ఎంజీఎం మైదానంలో ఆదివారం ఎమ్మెల్యే బాలకృష్ణకు పౌరసన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన సాయంత్రం బాలకృష్ణ తన సతీమణి వసుంధరతో కలిసి రథంలో సభా ప్రాంగనానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేలు, మంత్రులు, స్థానిక నేతల నుంచి ఘన స్వాగతం లభించింది. సభకు నియోజకవర్గ వ్యాప్తంగా జనం తరలి వచ్చారు. మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరారెడ్డి, సునీత, కందికుంట స్థానిక నేతలు పాల్గొన్నారు.

ఘనంగా సీతారామ విగ్రహ ప్రతిష్ట

మడిగుబ్బ: మండలంలోని బి.కొట్టాల గ్రామంలో ఆదివారం సీతారామ లక్ష్మణ, హనుమ సమేత విగ్రహ పునఃప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పెద్ద బయన్న సుబ్బిశెట్టి, రామకృష్ణ, రామచంద్ర, చిన్నబయన్న, శేఖర్, కృష్ణయ్య, నాగరత్నం, ఎల్ఐసీ రమణ, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కమనీయం.. రథోత్సవం



బసవేశ్వరుడి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో బసవేశ్వరుడు

అమరాపురం: వీరశైవ లింగాయతుల ఆరాధ్య దేవుడు బసవేశ్వరస్వామి రథోత్సవాన్ని ఆదివారం రాత్రి మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వరస్వామి ఆలయంలో స్వామికి వివిధ రకాల పూజలు చేశారు. రాత్రికి స్వామి వారి ఉత్సవ విగ్రహన్ని రథంలో కొలువుదీర్చి వివిధ రకాల పూజలు చేశారు. అనంతరం బసవన్న గుడి నుంచి మెయిన్ బజార్, బస్టాండ్ వరకు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా హర, హర బసవరాజ్ మహారాజ్‌కి జై అంటూ నినాదాలు చేశారు. మేళా తాళాలు, భజనలతో మహిళా భక్తులు చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అనంతరం వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రసాదం అందజేశారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం



జీవామృతంతో నవధాన్యాల విత్తనాలను శుద్ధి చేసిన దృశ్యం

మడకశిరరూరల్: ఆమిదాలగొంది గ్రామంలో రైతు నారాయణ పొలంలో ఆదివారం నవధాన్యాల విత్తనాలు సాగు చేయించినట్లు ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జ్ రమేష్, రైతుసాధికార సంస్థ కమ్యూనికేషన్ టీమ్ సభ్యులు మల్లేశ్వరి, కీర్తన తెలిపారు. అలసంద, సజ్జ, అనుములు, ఆముదంతో పాటు 25 రకాల జీవ వైవిధ్య పంటల విత్తన గుళికలు వేయించినట్లు పేర్కొన్నారు. నవధాన్యాల సాగుతో పంటలు పండటంతో పాటు భూమి సారవంతంగా తయారవుతునంది తెలిపారు. ఇతర పంటలను సాగు చేసే మంచి దిగుబడి పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఏ–గ్రేడ్, ఏటీఎం మోడల్ ద్వారా పంటల సాగుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ మంజునాథ్, ఐసీఆర్‌పీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గోపుర కలశ స్థాపన



గోపురంపై కలశాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం



ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

రొళ్ల: పిల్లిగుండ్ల గ్రామ సమీపంలో వెలసిన గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం గోపుర కలశ స్థాపన వైభవంగా జరిగింది. తొలుత లక్ష్మీదేవి మూల విగ్రహానికి అంకురార్పణ, కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం లక్ష్మీదేవి విగ్రహాన్ని వెండి, బంగారు ఆభరణాలతో పాటు పూలతో అలంకరణ చేసి మహామంగళ హారతి ఇచ్చారు. గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాలు నిర్వహించి 12 సంవత్సరాలు కావొస్తుండటంతో అమ్మవారిని కొలిచే చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి వందల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ సమీపంలో అశ్వత్థకట్ట వద్ద నాగులు విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం వివిధ తరగతుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అంజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్ణాటక రాష్ట్రం కొరటగెర తాలూకా ఎలెరాంపుర కుంచిటి వక్కలిగ మహాసంస్థానం పీఠాధిపతి హనుమంతనాథ మహా స్వామిజీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడు, తాలూకా కుంచిటి వక్కలి సంఘం అధ్యక్షుడు, స్థానిక జెడ్పీటీసీ సభ్యులు అనంతరాజు తదితరులు అతిథులుగా హాజరయ్యారు. గుట్టే లక్ష్మీదేవి ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాలకు హాజరైన ప్రముఖులకు శాలువాలు కప్పి, పూలమాలతో సన్మానించారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

నేడు జలధి ఉత్సవం

రొళ్ల: గుట్టే లక్ష్మీదేవి ఉత్సవాల్లో భాగంగా సోమవారం జలధి ఉత్సవం, అమ్మవారికి తల నీలాల సమర్పణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. జలధి ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు, కై వాడస్తులు తదితరులు కోరారు.

మామిడి రైతులను ఆదుకోండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ధర్మవరం రూరల్: జిల్లాలో రెండు రోజుల క్రితం గాలివాన సృష్టించిన బీభత్సంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని, వారిని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో సుమారు 1000 ఎకరాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లిందన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి గాలివానకు మామిడి కాయలు నేలకొరిగాయన్నారు. అప్పులు చేసి పంటకు పెట్టుబడులు పెట్టిన రైతులకు కూలి ఖర్చులు కూడా వచ్చే అవకాశం లేదన్నారు. ఉద్యానశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి మామిడి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కమిటీ సభ్యుడు మారుతి, సీఐటీయూ నాయకులు ఎస్ హెచ్‌బాషా, జేవి రమణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

తనకల్లు: మండలంలోని కొక్కంటిక్రాస్ నర్సరీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రమీజా, హమీదా, రాబియా, అశోక్ ఆటోలో తనకల్లుకు బయలుదేరారు. అయితే నర్సరీ వద్దకు రాగానే ఆవు రోడ్డుకు అడ్డంగా వచ్చింది. దీంతో ఆటో అదుపు బోల్తా తప్పింది. ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు కింద పడడంతో బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

ఓడీచెరువు: గోరాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు..నల్లమాడ మండలం యర్రవంకపల్లికి చెందిన వేణుగోపాల్ బైక్‌పై గోరంట్లకు బయలుదేరాడు. గోరాపురం వద్ద బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడని స్థానికులు 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లినట్లు సమాచారం.

ఉష్ణోగ్రత సమాచారం

హిందూపురం	37.0
పెనుకొండ	40.0
మడకశిర	37.0

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



ఉషశ్రీ చరణ్‌ను కలిసిన నాయకులు

సోమందేపల్లి/పెనుకొండ రూరల్: గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ సూచించారు. ఇటీవల నియమితులైన మండల కమిటీ నాయకులు ఆమెను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పార్టీలో అన్ని వర్గాలకూ సముచిత స్థానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, ఉపాధ్యక్షులు ఈదుళబలాపురం ఆదినారాయణ రెడ్డి, ట్రాక్టర్ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శులు గంగప్ప, హనుమంతు, సూర్యప్రతాప్‌రెడ్డి, మురళీకృష్ణ, కార్యదర్శి రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాత ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ బలరామిరెడ్డి

హిందూపురం: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వాసవి జయంతి వేడుకల్లో భాగంగా ఆదివారం అమ్మవారు విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బలరాం రెడ్డి , వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్య వైశ్య సంఘం ఆహ్వానం మేరకు పట్టణ ప్రముఖులు తరలివచ్చి స్వర్ణ వాసవీమాతను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ ప్రముఖులను ఆర్యవైశ్య సంఘ సభ్యుడు జేపీకే శాలువాతో సన్మానించారు.

సిద్ధేశ్వర స్వామికి పూజలు



అలంకరణలో సిద్ధేశ్వరుడు

అమరాపురం: మండల పరిధిలోని ప్రసిద్ధ శైవక్షేత్రం హేమావతిలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వర స్వామికి ఆదివారం భక్తులు విశేష పూజలు చేశారు. సిద్ధేశ్వర స్వామికి త్రికాల పూజలైన సుప్రభాత సేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు చేశారు. అనంతరం వివిధ రకాల పూలమాలలతో స్వామిని చూడముచ్చటగా ప్రత్యేకంగా అలంకరించారు. మహామంగళ హారతి అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పావగడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో హెల్ప్ సొసైటీ సేవాట్రస్ట్, బెంగుళూరు సప్తగిరి ఆస్పత్రి సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య చికిత్స శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో ఈఎన్టీ, పిడియాట్రిక్, ఆర్థోపెడిక్, గైనకాలజీ వ్యాధిగ్రస్తులకు ప్రముఖ వైద్యులు ఆరోగ్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో శిబిరం నిర్వాహకులు మానం శశికిరణ్, సంధ్యా శశికిరణ్ తదితర వలంటీర్లు పాల్గొన్నారు.